# కదిలే బొమ్మలు

ముత్యాలమ్మ నల్లగా దిమిశా చెక్కలా ఉంటుంది. పొట్టిగా రాతి రోల్లావుంటుంది. విప్పితే చెప్పుల్దాకా పరిగెత్తే నోట్లో పళ్ళు గవ్వల దండల్లా వుంటాయి. పర్వతాల్లాంటి పిరుదులు కదుపుతూ, మోటారు టైరుల్లాఉన్న చేతులూపుతూ, వార్డులో పచార్లు చేస్తుంటే, యీమె కొన్ని జన్మల క్రిందట లంకకి కాపున్న లంఖిణో, భీముణ్ణి వలచిన హిడింబో అనిపిస్తుంది. ముత్యాలమ్మ పురుళ్ళ వార్డులో 'ఆయా.' రాత్రి డ్యూటీచేస్తుంది.

సాయంత్రం ఐదు దాటి సూర్యుడు ఎర్రబారి పడమటికేసి జారిపోతూంటే ఆస్పత్రి గేటవతల 'తలుపులు' కిళ్లీకొట్టు దగ్గర మొదటిమజిలీ చేస్తుంది. కొట్టుమీద తలుపులుంటే, నిస్పృహ సూచించే గొంతుతో కరువుతోబాటు లోకం అంతా యెలా మండిపోతోందో చిన్న ఉపన్యాసం యిస్తుంది. గంటపోయాకా వార్డుకొస్తే 'భాగ్యం స్టాఫ్' చేత అతని మోకాళ్ళ పట్లకి ఇంజక్ష నిప్పిస్తానంటుంది. తలుపులు కొడుకుంటే, చిరు నవ్వులొలకబోస్తూ 'ఎన్టీవోడు,' 'నాగేస్సర్రావు' గురించి మాట్లాడి, తొమ్మిద్దాటేక కోడిగ్రుడ్లు, బ్రెడ్డు, వెన్న తెచ్చి యిస్తానంటుంది. కారాకిల్లీ బిగించి గంతులేసినట్టే నడుస్తుంది గేట్లోకి.

రాత్రి డ్యూటీ వాచ్‌మన్ శ్రీరాములు గేటులోపల అరుగు మీద గొంతికిలా కూచుని దగ్గుతూ ముత్యాలమ్మని పలకరించి 'అప్పన్న కులాసాయేనా' అని ప్రశ్నిస్తాడు.

'ఆడికేపిఁ! ఆడు కోడిపుంజు. ఆడిసుట్టూ సిగ్గుమాల్న పెట్టలు తిరుగుతూ అణ్ణొదలవు. ఈ నాయారళ్ళకి సిగ్గులేవయ్యా. సొంత మొగుళ్ళ నొదులుకొని అరువు మొగున్నొట్టుకున్న గుడిసేట్లకి సిగ్గా నజ్జా...' రైలు కూసినట్టరుస్తుంది.

ముత్యాలమ్మకి రహస్యాల్లేవు.

ముత్యాలమ్మ వార్డులో కొస్తూనే పదో నెంబరు ఖాళీగా వుండడం గమనించింది. తలుపులుతెరిచి ఖాళీగావున్న లాకరు చూసి 'దీనిజిమ్మడా' అని పైకే అనేసి నిట్టూర్చింది.

'నాకెరికే - ఈ నంజ నయాపైసా దులపకండా వుడాయిస్తాదని. నానప్పుడే అనుకున్నా, నువు సూళ్ళేదాః' డ్యూటీ దిగిపోతున్న లక్ష్మిని గదవాయించినట్టడిగింది.

'ఏదీ... నాను పుస్తకం పొట్టుకొని ఆఫీసుకెళ్ళా... తిరిగొచ్చి సూద్దునుగదా బెడ్డు ఖాళీ...'

'దాని మొగుడింజలీరుడే... ఆడిబాబుగోడి సొమ్ములా గౌర్మెంటు కార్లోనే దొంగనాగొట్టుకు పోయుండాల దాన్ని సొసానానికి...' కసిదీరా దులిపింది ముత్యాలమ్మ.

వరండామీద ముత్యాలమ్మ పన్నెండేళ్ళ కొడుకు, పదేళ్ళ కూతురు పురిటి నొప్పులు పడుతున్నారు.

'ఓలమ్మో...' కొడుకు.

'ప్రైమైపోతాందే...' కూతురు.

ముత్యాలమ్మ వాళ్ళవేపు కొరకొరా చూసింది.

'ఊరు బాబుగోళ్ళకి పుట్టిన యదవల్లారా, ఉండండి.' అని చరచర పదిహేడో నెంబరు దగ్గిరికెళ్ళింది.

'అమ్మగోరూ- రెండ్రూపాయిలిప్పించండి. ఆ దిక్కుమాలినోళ్ళు సినిమాకి డబ్బులియ్యకపోతే నా పానాలు తోడేస్తారు...'

పదిహేడో నెంబరు ఐదురోజుల పిల్లడికి పాలివ్వడానికి ప్రయత్ని స్తూంది. ఆవిడకి ముత్యాలమ్మంటే ప్రాణం. ఆవిడ కళ్ళకి ముత్యాలమ్మ నల్లగా దిమశా దుక్కలా వుండదు. తెల్లగా సన్నగా సళాకులా వుంటుంది. ముత్యాలమ్మ మాటలావిడికి తేనెవూటల్లా వుంటాయి. ఆవిడకి కావలసింది సదుపాయం. అదీ యితరులకన్న ఎక్కువ సదుపాయం.

ఆస్పత్రిలో వైద్యంచేసే డాక్టర్లలో మూడొంతులు పైగా పురిటి నొప్పులెలా వుంటాయో తెలీని 'పిల్లమ్మ డాక్టర్లు'. వాళ్ళు నిద్రకళ్ళతో వున్నా తమ మంచం చుట్టూ చేరాలి. తన భర్త వాళ్ళతో ఇంగ్లీషులో మాట్లాడాలి. మధ్యమధ్య అతను 'జోక్సు'కూడా విసిరి పిల్లమ్మ డాక్టర్ల చేత నవ్విస్తుంటే ఆమెకి దర్జాగా వుంటుంది.

పదిహేడో నెంబరు తన పక్కనే బంట్రోతులా నిలబడ్డ భర్తకేసి దర్జాగా చూసింది. ఆమె మౌనవ్యాఖ్య అతనికి క్షణంలో అర్థమైంది. జేబులోంచి రెండు రూపాయల నోటుతీసి ముత్యాలమ్మ కిచ్చేడు. ముత్యా లమ్మ తలవంచి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వరండాలోకి దొర్లుకు పోయింది.

'ఎల్లండి అనాద యదవల్లారా, సినిమా అయిపోగానే యిటూ అటూ బోకుండా తిన్నగొచ్చెయ్యండి. సెడ్డులో కేరేజి వుంది. తిని కేరేజి కట్టేసి తొంగోండి '

ముత్యాలమ్మ పదిహేడో నెంబరు దగ్గరికి తిరిగొచ్చే సరికి ఆ పేషెంటు భర్త డాక్టర్లు, స్టాఫు కూచునే దగ్గిర కెళ్ళేడు. అక్కడ యిద్దరు పిల్లమ్మ డాక్టర్లున్నారు. పక్కనే వాళ్ళేదో రిజిష్టర్ చూస్తున్నారు. కుర్చీలో 'భాగ్యం స్టాఫ్' కూచుంది.

భాగ్యం స్టాఫు కూచుంటే గువ్వపిట్టలా వుంటుంది. నిలబడితే పురి విప్పిన నెమలిలా వుంటుంది. నడిస్తే హంసే.

ట్రైనింగు నర్సులు హడావిడిగా తిరుగుతున్నారు. సాయంత్రం సుమారేడు గంటలైంది.

'ఓలమ్మో...' కేక.

పదిహేడో నెంబరు అదిరిపడి బిడ్డణ్ణి దగ్గిరికి తీసుకొని కళ్లు మూసుకుంది. ఆమె భర్త చరచరా వచ్చి ఓసారి భార్యమీద చెయ్యివేసి, పక్కనే నిలబడ్డాడు.

'ఇకనే వెళ్ళనా? రాజమ్మ వచ్చింది...' భర్త.

'కొంచంసేపుండండీ నాకేమో దిగులుగా వుంది.'

కేకవేసింది పదహారో నెంబరు. పదహారో నెంబరు లాకరు వొక కాలు విరిగి అప్పంబొట్లు పందిర్లా వూగుతూంది. అందులో వో కుళ్ళుసంచీ, అక్కడక్కడా పింగాణి వూడిపోయిన ప్లేటు, ఒక సిల్వరు గ్లాసూ వున్నాయి.

'డాక్టరు జివాగో బాగుందిట...' ఓ పిల్లమ్మ డాక్టరు పెన్సిలు కొన బుగ్గమీద ఆనించి మరో పిల్లమ్మ డాక్టర్నడిగింది...

'ఆఁ... యేం బాగో- నాకా కథే బోధపళ్ళేదోయ్. సుధాకరం బలవంతం చేస్తే వెళ్లా. అతనొకడూ, పట్టుకుంటే బంకలా వొదల్డు-'

'నేను మొన్నరాత్రి 'బ్రహ్మరాక్షసి' చూశా...'

'బ్రహ్మరాక్షసిలో కే. డి. బాగా యాక్టు చేశాట్ట. చారుమతి పాటలు వండర్‌ఫుల్‌గా వున్నాయట. నాకు వెధవ ఇంగ్లీషు సినిమాలు నచ్చవోయ్ మరీ సెక్సీగా వుంటాయి...'

'అమ్మో సచ్చిపోనానే...' వార్డు అదిరింది పదహారో నెంబరు కేకతో. గువ్వ పిట్టలా కూచున్న భాగ్యం స్టాఫు అటు నిమ్మళంగా తల తిప్పి చిరునవ్వు నవ్వింది. పిల్లమ్మ డాక్టర్లు వోసారి మొహాలు చూసుకొని నవ్వుకున్నారు.

'డాక్టరు జివాగోలో 'రేప్' చూపించార్ట...'

'ఏదో మసక మసగ్గా... అయినా, డర్టీ, నాస్టీ' పుట్ రూలుతో బల్లమీద గీస్తూ అంది, ఇంగ్లీషు సినిమాలు నచ్చని పిల్లమ్మ డాక్టరు. కాని ఆవిడ ప్రతి ఇంగ్లీషు యెవరో వొక సుధాకరం బలవంతంమీద చూస్తుంది

'డర్టీ-నాస్టీ' అన్న మాటలకి భాగ్యం స్టాఫు దగ్గినట్టు నవ్వింది. ఆవిడ యేమనోభావాన్నయినా, నవ్వుద్వారా వ్యక్తపరుస్తుంది. ఆమె ప్రతి నవ్వునీ 'ఎనాలిసిస్'కి లాబొరేటరీకి పంపి అర్థం చేసుకోవలసిందే.

ఆమె డ్యూటీలోకి వచ్చినపుడు, డ్యూటీ దిగిపోతున్నప్పుడు సన్నగా నవ్వుతుంది. పేషెంటు విపరీతంగా పురిటి నొప్పులు పడుతూ గుండె తెగేలా యేడుస్తూంటే ఆమె అలతిగా నవ్వుతుంది. ఎవరైనా ఏదైనా చేతిలో పెట్టినపుడు, కొండంత చిరునవ్వు నవ్వుతుంది. రాత్రి వొంటిగంట దాటేకా కార్లోంచి దిగి క్వార్టర్సువేపు నిమ్మళంగా నడుస్తూ, కొంచెం వొళ్లు తిప్పినట్టయి, వెన్నెల్లో బాదం చెట్టుకింద ముసిలి వాచ్ మాన్ శ్రీరాములు భుజాన్ని అనుకొని నవ్వే బుల్లినవ్వు వెనక మొగలు చిబ్బిల కులుకు వుంది. అప్పుడామె వూపిరిలో ఘాటైన వైను పరిమళానికి శ్రీరాములు ముసిలి గుండెలో పడుచుదనపు కదిలేబొమ్మలు తారాడతాయి.

ఇప్పుడా బాదంచెట్టుకి రెండే కొమ్మలు. పది, పన్నెండు ఆకులు. ఎండవేళ ఆ చెట్టుకింద నీడ లేదుగాని, ఆ పది, పన్నెండాకుల మచ్చలు న్నాయి. ఆ మచ్చలమీద నిలబడి కరివేపాకు అమ్ముకునే అచ్చన్న పంచె చెంగుతో చెమట తుడుచుకొంటున్నాడు. పగలు డ్యూటీ వాచ్ మాన్ నారాయణ అచ్చన్నని తక్కున అక్కడ నిలబెట్టేడు. కూతురు మూడ్రోజుల నించీ నొప్పులు పడుతూంది. పురుడాడ్దు. ఆమె బాధ నెవ్వరూ అంతగా పట్టించుకోవడం లేదు.

పగటిపూట నియమిత వేళల్లో తప్ప వార్డుల్లోకి మగాళ్లు వెళ్ళకూడదు. బుష్షర్టులు, పంట్లాంలు వేసుకొని ఇంగ్లీషు మాట్లాడేవాళ్లు వెళ్లొచ్చు. తెలుగు మీడియమ్‌వాళ్ళు వెళ్ళకూడదు. అచ్చన్నభార్య అంఖాను పుంఖాలుగా జ్వరంవచ్చి మంచాని కంటుకుపోయింది. అచ్చన్న సూర్యుడు యెప్పుడు నడి నెత్తిమీద కొస్తాడా అని చూస్తున్నాడు.

'మా నాన్న పగల్దాటీ సేసేవోడు' బీడీ దమ్ములాగి నారాయణ ఆరంభించేడు- పాతకథ. అచ్చన్న వింటున్నాడు. గాని పన్నెండెప్పుడవుతుందా అని చూస్తున్నాడు.

ఆ వేళ పెద్దమ్మగారు రౌండ్లకొస్తారు. ఆస్పత్రంతా కడిగేసిన గచ్చకాయలా వుంది. ఆయా, నర్సులూ మహా సీరియస్‌గా వున్నారు. పేషెంట్ల తాలూకు వాళ్ళని కాకుల్ని తరిమినట్టు తరిమేసేరు. బాత్‌రూములు ఫినైలేసి కడిగించి బందుచేసేరు. పెద్దమ్మగారి రౌండ్లు ముగిసేవరకూ కడుపొంగిన వాళ్ల భజన చెయ్యవలసిందే. వార్డు చుట్టుపక్కల మగాళ్ళెవరైనా అగుపిస్తె పెద్దమ్మగారికి పూనకం వస్తుంది.

'నానప్పుడింతుండేవాణ్ని' నారాయణ మళ్ళీ కథందుకున్నాడు. అచ్చన్నకి వుదయం సంగతి జ్ఞాపకం వస్తూంది.

'మా బొట్టెకి పురుడాగ్నేదు. శానా బాధ పడుతూంది.'

'మా యింటిదానికి వుడుకొచ్చి మంచాని కంటుకు పోయినాది.'

'అక్కడ దాన్ని చూసే దిక్కునేదు— ఇక్కడ దీన్ని సూడ్డానికి తల్లినేదు...' అచ్చన్న కళ్ళల్లో నీళ్లు తిరిగేయి.

'నీ కూతురుకి పురుడాగ్కపోతే నన్ను కనమంటావయ్యా...? ఏటా మాట! అదే వొస్తాది. సూడది! వార్డంతా వులేసమేస్తన్నాది. మంచంమీద యెల్లకిలా తొంగోని సేతులెనక్కి తిప్పి? మంచం దండె రెండు సేతుల్తోటి- ఇనాగ- ఇనాగ ఒట్టుగుని కదలకుండా వుండాలి. అచ్చన్న కూతుర్ని దబాయించి వెనక్కి నొక్కిపెట్టి అంది ముత్యాలమ్మ.

'ఓ లమ్మో...' అచ్చన్న కూతురు గావుకేక పెట్టింది. లోపల బిడ్డ తల్లి కడుపులో యెక్కడ తంతూందో పరమాత్ముడికెరుక.

'భగవాన్... చావు నయం!' లేబరు గదిలోంచి పెద్ద కేక. కేక వెనుక ఒక దీర్ఘ రోదన వినిపించింది.

పిల్లమ్మ డాక్టర్లు, స్టాపు నిలబడే. అర్జంటుగా చిన్న మీటింగు చేసేరు. 'యస్, వుయ్ షల్ పుట్ హర్ ఆన్ సెలైన్.'

గుసగుసలాడేరు. విసవిస నడిచేరు. సెలైన్ సరంజామా తగిలించేరు. 'ఇది ఆరెమ్మోగారి కేసు' మళ్ళీ గుసగుసలాడేరు.

'ఇదేటమ్మా- మళ్లీ లెగిసిపోయావా? నీకు బుద్ధినేదూ- గెంతులేశావంటే తరవాత నీ పాట్లు నీకే తెలుస్తాయి. అప్పుడు గెంతులేసినట్టు యిప్పుడు గెంతులెయ్యకూడదు. మెదలకుండా యెల్లకిలా తొంగో. బిడ్డ అడ్డంగా తిరిగి పోనాదంటే, నీ పానానికే మోసం వస్తాది...' ఆయా పది హేడో నెంబరు దగ్గిర్నుంచి చిన్న వుపన్యాసం విసిరింది.

'నాకు సావే నయం తల్లో— మూడ్రోజులైపోనాది...' అచ్చన్న కూతురేడుస్తున్నాది.

బాదం చెట్టుకింద అచ్చన్న కడుపులో సముద్రపు కెరటాలు తిరుగుతున్నాయి.

'అప్పుడు మా అయ్యతో నాను ఆస్పత్రికొచ్చేవోణ్ణి. ఇంతుండేవోణ్ణి అప్పుడీ గోడల్నేవు. గేటునేదు. ఈ బాదం శెట్టు శానా పెద్దది. దీనికింద ఇక్కడ్నీడుండేది. "ఆలెన్" దొరసానమ్మ గోరే పెద్దమ్మగోరు. ఆలెనమ్మ గోరంటే యేటి? పులి! సెట్టు దాటి అలగా జనం లోనికి రాడమే? సెట్టు మీద కాకు లరవడానికిల్లేదు.

'ఆలెనమ్మగోరు, కాకుల్ని తరిమే వుజ్జోగం నాకిచ్చేరు. అదిగో - ఆ గదే పెద్దమ్మగోరిది. కిటికీ యెంబడి బాదం సెట్టవుపిస్తాది. కాకి కావంటే సాలు అమ్మగోరు- కలం కిందెట్టి- శరశర బైటకొచ్చి-నడ్డిమీద సేతులేసుకొని, సెట్లకేసి సూస్తూ "నారాయణా-కాకి" అనే వోరు. నా నక్కడే వుండేవాణ్ని. సరాల్న నెగిసి రాత్రిబెడ్డ యిసిరి, కాకిని తగిలేసేవోణ్ని. ఓపాలి ఓ ముండాకాకి శానా అల్లరి పెట్టింది. ఇట్టు గొడితే అటూ, అటు గొడితే ఇటూ ఎగిరింది. కావు కావుమని వొకటే అరుపు. దానరుపుతో

పెద్దమ్మగోరి అరుపుల్తో నా కొల్లు మండి మార్కెట్టు దాకా తరిమేను, ముండకాకిని...'

నారాయణ కథ ముగించేడు.

సూర్యుడు నడినెత్తిమీద కొచ్చేడు. అచ్చన్న వార్డు వేపు ఆతృతగా నడిచేడు.

కూతురు అపసోపాలు పడుతూంది. కదలకుండా పడుకోమని చుట్టుపక్కల వాళ్ళామెకి సలహాలిస్తున్నారు.

ఆయా లక్ష్మి కేకలేస్తోంది. పిల్లమ్మ డాక్టర్లు లేరు. లేబరు గదిలో ఆరెమ్మో కేసుకి సెలైన్ పెడుతున్నారు. అన్నం పట్టుకొచ్చిన తండ్రిని చూడగానే ఆమెకి దుఃఖం, కోపం వొకేసారి కలిగేయి. ఎంత బతిమాల్నా అన్నం తిననంది.

పదిహేడో నెంబరు భర్త చేతులు కట్టుకొని దర్జాగా భార్య పక్క నిలబడ్డాడు. ఠీవిగా వున్నాడు. భాగ్యం స్టాపు వచ్చి అతని పక్క అరబ్బీ గుర్రంలా నిలబడి వుంది. బేబీకి "మదర్స్‌మిల్కు" చాలకపోతే ఫలానా మిల్కు యిమ్మంటూంది. ఉండుండి అచ్చన్న కూతురువేపు చూసి 'ఈ ఇల్లిటరేట్స్‌తో ఇదే బాధండీ...' అంటూంది.

'యస్ యస్. ఐకెన్ అండర్‌స్టాండ్. మీకు స్టాపు తక్కువ. కేసులెక్కువ. మధ్య యీ నాస్టీ ఇల్లిటరేట్స్‌తో గొడవ. మా ఆవిణ్ణి స్పెషల్ వార్డులో చేరుద్దామనుకున్నా. ఖాళీలేదు. మీలాంటి వాళ్లున్నారు కాబట్టి కొంత నయం. లేకపోతే హెల్!' అంటూ తన మటుకు తనొక హిమాలయ పర్వతం అంత వున్నాననుకున్నాడు పదిహేడో నెంబరు భర్త.

ఇంతలో వార్డు ముందో కారాగింది. కార్లోంచి వో పేషెంటు, ఆమె వెనక శంక చక్ర గదా పద్మాల్లా తలగడాలవాళ్ళు, దుప్పట్ల వాళ్ళు, ఫ్లాస్కులవాళ్ళు, స్టీలు మరచెంబుల వాళ్లు దిగేరు. నర్సులు, ఆయా, ట్రైనింగు నర్సులు, స్టాపు, యెక్కడెక్కడున్న వాళ్ళూ బాదంచెట్టు మీద

కాకుల్లా పరిగెత్తుకొచ్చేరు. పిల్లమ్మ డాక్టర్లు స్టెతోస్కోపులు భుజాల మీదికి విసిరి చరాచరా నడిచేరు.

అయిదో నెంబరు బెడ్‌మీద పాలమీగడ లాంటి దుప్పటి పరుచుకుంది. అందమైన మెత్తటి తలగడలు అమిరేయి. అర్జంటుగ మూడు స్క్రీనులు తెచ్చి మంచం చుట్టూ పెట్టేరు. క్షణంలో జనరల్ వార్డు ఒక చిన్న స్పెషల్ వార్డుని ప్రసవించింది.

కొంతమంది స్క్రీనులోంచి లోపలికి దూరేరు. చకచక అవసరమైన సరంజామా తెరల్లోకి వెళ్లతూంది చకచక టెస్టులు ముగిసేయి. పెద్దమ్మగారు కార్లో వచ్చిన పెద్దమనిషితో నిదానంగా మాట్లాడేరు.

'ఫరవాలేదు. డోంట్‌వర్రీ: సాయంత్రం లోపున పురుడొస్తుంది. ఇఫ్ నెససరీ 'సిజరిన్ చేయవలసి వుంటుంది. నేనే స్వయంగా ఆపరేషను చేస్తా' పెద్దమ్మగారన్నారు. అది ఆమె కేసు.

ఆస్పత్రిలో ఆయా దగ్గర్నించి పెద్దమ్మగారి వరకూ అందరికీ స్వంత కేసులుంటాయి. ఎవ్వరికీ సంబంధించని కేసు బతికితే దేవుడిదీ లేకుంటే యముడిదీ.

పదిహేడో నెంబరు భర్త యీ హడావుడితో తారెత్తిపోయాడు. హిమాలయం అంత మనిషి క్షణంలో వామనావతారం అయిపోయాడు. తన 'వైఫు' గురించి సూపరెంటుతో మాట్లాడదామని అతనికి మొదట్నించీ వుంది. కాని ఆవిడ గత నాలుగు రోజుల్లో ఒక్కసారీ వార్డుకి రాలేదు. ఇప్పుడామె పదకొండో అధ్యాయంలో విశ్వరూపంలా దుర్నిరీక్ష్యంగా వుంది. తన భార్య నిస్సత్తువగా కళ్ళు మూసుకోవడం గమనించి, పిల్లిలా బాత్‌రూములున్న వరండామీదికి వెళ్ళిపోయాడు- వామనావతారం.

సాయంత్రం ఐదయేక ముత్యాలమ్మొచ్చింది. పదిహేడో నెంబరు వేపు తొంగైనా చూళ్ళేదు. తిన్నగా స్క్రీనుల గదిలో దూరిపోయింది.

మరో గంటలో స్క్రీనుల గది సర్కస్ డేరాల మయమయింది, ఆ పేషెంటు అసలు స్పెషలు వార్డులోకి వెళ్ళిపోయింది.

పూర్వం స్వతంత్ర సంస్థానాలున్నప్పుడు, వాళ్ళ రాణీవాసాలు యెప్పుడైనా అంతఃపురాల్లోంచి బైటకొస్తే, వాళ్ళచుట్టూ యిలాగే పట్టు తెరలు పట్టేవారట. ఇప్పుడు స్వతంత్ర సంస్థానాల్లేవుగాని, పట్టుతెర లిప్పటికీ జారిపోలేదు. రాణీవాసాలు లేవుగాని "మహాకానివాసా" లున్నాయి. ఇవెప్పుడు పోతాయో అనుకున్నాడు వరండాలో పచార్లుచేస్తూ వామనుడు. ఆలో అని దిక్కులేక ఏడుస్తున్న అచ్చన్న కూతురంటే అతనికి జుగుప్స. తెరల్లో కులికే యీ 'మహాకానివాసాలంటే' మంట. ఈ కిందికి దిగలేడు, ఆ మీదికి వెళ్ళలేడు. రెండింటికీ మధ్య వేళ్ళాడు తున్నాడు వామనుడు.

సాయంత్రం ఐదు దాటింది. సూర్యుడు యెర్రగా మండిపోతు న్నాడు. పడమటి ఆకాశం, కనుచూపు మేర, వెదురు పొదలు అంటుకొని చిటపట పేల్తున్నట్టుంది. మేడల వుపరిభాగాలు నెత్తురు పులుముకున్నాయి.

ముత్యాలమ్మ కళ్ళు రైలింజను దీపాల్లా వున్నాయి. తలుపులు కిళ్ళీకొట్టుదగిర మజిలీ చేసింది. ఉలకలేదు - పలకలేదు. మౌనంగా అందు కొని కారాకిళ్ళీ బిగించింది.

'ఏటి ముత్యాలమ్మా - ఇయాల్టి మొకం అగ్గిగుండంనాగుంది...' తలుపులు కొడుకు హాస్యమాడినట్టన్నాడు.

'ముండలకి సిగ్గులేదయ్యా, నానిల్లు దాటగానే నాయింట్లోనే సేరు తన్నారు. నా మొగుడు పెల్లాలు నాకాపరానికే యెసరెడుతున్నారు. అంత దీనిగుంటే కంపెనీల్లో సేరిపోరాదా? అల్లసరదా తీరతాది-కంపెనీలూ బాగుపడతాయి. సొంత మొగుళ్ల సేతకాని సవటలైతే వూరు మొగుళ్ళమీద పడిపోవడవే(సీత్తరికో...' కిల్లీ వుమ్మి వుమ్మి బండబూతులు తిట్టింది.

ముత్యాలమ్మ పేషెంట్ల దగ్గిర డబ్బు గుంజుతుంది. ఆస్పత్రిలో రొట్టెలు, వెన్న, దుప్పట్లు, తలగడ గలీబులు, మందులు మొదలైనవి దొంగలాడి, అవన్నీ అమ్మి డబ్బు చేస్తుంది. ఆ డబ్బంతా మొగుడు

బతిమిలాడి,యేడ్చి, తన్ని లాక్కొని తాగేస్తాడు. మొగుడు తాగితే అంత బాధపడదు ఆరోగ్యం పాడైపోతుందని కొంచెం తగ్గించమంటుంది. కాని అతని తిరుగుళ్ళు సహించలేదు ఒక్కొక్కరోజు తిరగబడి, అల్లరి చేసి, చావు దెబ్బలు తింటుంది. దెబ్బలు ఖాతరు చెయ్యదు. కాని మొగుడి చిల్లర తిరుగుళ్ళకి మండిపోతుంది ఆ మంటతో పేట పేటల్లా వీరవిహారంచేసి, తన మొగుడితో తిరిగే వాళ్ళందర్నీ యిరవైడుతరాలు, అటేడు తరాలు దుమ్మెత్తి పోస్తుంది. అలాంటి పరిస్థితిలో తన మనసులోని తీవ్రతంతా వార్డులో చూపిస్తుంది.

ముత్యాలమ్మ వస్తూనే పదహారో నెంబరుకేసి చూసింది. ఆయా లక్ష్మి - వొక నర్సు, ఇద్దరు ట్రైనింగు నర్సులు వున్నారు. కొంచెం దూరంగా భాగ్యం స్టాపు అరబ్బీ గుర్రంలా నిలబడింది. అచ్చన్న కూతురు శరీరం నిండా దుప్పటి కప్పేవుంది. ఆ దృశ్యం చూడగానే ముత్యాలమ్మ గతుక్కుమంది.

'రా! రా! ముత్యాలమ్మా? సాయంపట్టు ఈ శవాన్ని ఐస్ రూంలో పడెయ్యాలి'...స్టాఫ్.

ముత్యాలమ్మకి యెటుపట్టాలో వెంటనే తెలియలేదు. ఇటు అటు తిరిగి తబ్బిబ్బులైంది. తనది భారీ శరీరం. కొంచెం శ్రమపడితే చమట. చివరికి తలవేపే చేరింది.

'గవర్నమెంటు కార్లొచ్చిన ఇంజనీరు పెళ్లాం కానీ దులపకండానే పారిపోనాది. ఇది యేకంగా సొరగానికే యెలిపోనాది. ఇలాంటి కేసు లొస్తే మా కడుపు నిండినట్టే-ఎత్తండి' ముత్యాలమ్మ విసుక్కుంది.

శవం చుట్టూ తిరుగుతూ అచ్చన్న యేడుస్తున్నాడు. కూతుర్ని ఆపరేషన్ గదిలోకి తీసుకెళ్లారు. గంట పోయాకా చచ్చిపోయిందన్నారు. అదేం ఆపరేషనో అతనికి తేలీదు. మరేం భయం లేదన్నారు. కడుపులో పిల్ల అదివరకే చచ్చిపోయిందట.

రాత్రి డ్యూటీ పిల్లమ్మ డాక్టర్లిద్దరు అప్పుడే వచ్చేరు. ఆపిల్లమ్మ డాక్టర్లూ ఈ పిల్లమ్మ డాక్టర్లూ వొకమూల చేరి గుసగుసలాడుతున్నారు.

సుధాకరంతో డాక్టరు జివాగోలో రేప్ సీను చూసి అసహ్యించుకున్న పిల్లమ్మడాక్టరు కళ్ళింతలు చేసి - 'కత్తి పెట్టగానే రక్తం సముద్రంలా పొంగింది, హౌటూ స్టాపిట్! 'బ్లడ్ వెసల్' కట్ అయిపోయింది.' గుసగుసలాడి, గజ గజ వణికింది.

'వెరీ సారి ! సరే! ఇప్పుడు విచారించి లాభంలేదు. ఇదొక గొప్ప అనుభవం...' డ్యూటీకి వచ్చిన సీనియర్ పిల్లమ్మ డాక్టరు సర్దింది.

సెలైన్ పెట్టినావిడకి రాత్రి తొమ్మిదిగంటలకు పురుడొచ్చింది. అరగంటపోయేక తల్లిని తీసుకొచ్చి పన్నెండో నెంబరు మీద పడుకోబెట్టారు. మరో అరగంట తరువాత పిల్లవాడికి నీళ్ళుపోసి, తువ్వాల్లో చుట్టి ముత్యాలమ్మ పక్కలో పడుకోబెట్టింది. తల్లి పక్కకి తిప్పి ఆత్రుతగా పిల్లాడ్ని నఖశిఖ పర్యంతం పరీక్షించింది. రంగు చూసింది. అన్ని వేళ్ళూ వున్నాయో లేవో చూసింది. ఆరో వేలు యెక్కడా లేదుకదా అని చూసింది. ఆడ పిల్లయితే బాగుణ్ణనుకుంది. ఆవిడ కప్పటికే ఇద్దరు కొడుకులున్నారు!

ముత్యాలమ్మ పిల్లడ్ని తెగ పొగిడింది. తన మామూలు పన్నెండు రూపాయలడిగింది. అది మొత్తం అని, అంతా పంచుకొంటాం అంది. పన్నెండో నెంబరు భర్త వొరలోంచి కత్తిదూసినట్టు చివాల్న మూడైదులు తీసి ముత్యాలమ్మకిచ్చి వొక విశాలమైన చిరునవ్వుం కూడా వడ్డీయిచ్చేడు.

'సిల్లర్రూపాయల్నాకాడ నేవు బాబు...'

'ఫరావాలేదు ఉండనీ...' మరో చిరునవ్వు చక్రవడ్డీలా యిచ్చేడు.

దీపాలు ఖాళీగా వెలుగుతున్నాయి. వార్డు నిశ్శబ్దంగా వుంది. డాక్టర్లూ నర్సులూ మొత్తం డ్యూటీమీద వున్న వాళ్ళందరూ థియేటరు ప్రాంతంలోనే వున్నారు. పెద్దమ్మగారు స్వయంగా 'మహకానివాసానికి' సిజరిన్ చేస్తున్నారు. స్వతంత్ర సంస్థానాధీశ్వరుడు బైట కారులో సిగ

రెట్ పీలుస్తున్నాడు. సిగరెట్టు పొగలోంచే అతనికి యేడుకొండల మీద ఆలయంలో పట్టినామాలు కనిపిస్తున్నాయి.

ముత్యాలమ్మ మూడైదులు జాకెట్లో దాచుకుని సర్రున నాగు పాములా మూడో నెంబరు దగ్గిరకెళ్లింది.

'సూడమ్మా? అడుక్కున్న దానికన్న యెక్కువే యిచ్చేడు. ఇలాటి మారాజులొస్తే మా కడుపుల్నిండుతాయి. నువ్వొచ్చి ఐదు రోజులైంది. నయాపైసా దులపలేదు. ఏట్నీ సంగతి? అసలిస్తావా, ఇయ్యవా? ఇప్పుడే పడేయ్! పండులాంటి కొడుకుని కన్నావు. సంతోషంగా నీకు తోచిన్ది పడేయ్...' ముత్యాలమ్మ.

'ఇస్తాను...!' మూడో నెంబరు నసిగింది.

'ఎప్పుడిస్తావమ్మా? ఎప్పుడైనా ఇవ్వనన్నావా? ఇస్తానంటూనే వున్నావు- ఇవ్వవు. నీతో యెవురూ రానేదు. ఇంకెప్పుడిస్తావు? ఇప్పుడే పడేయ్.'

'ఇస్తాను' తుంచినట్టంది మూడో నంబరు.

'నీకు బుర్రనేదటమ్మా? మల్లీ ఆ మాటే? రేపొద్దున్న నాను డూటీ దిగి యింటికెళ్ళి పోగానే నువు మాయమైపోవూ? రేపు నిన్ను డిశ్చార్జి చేస్తారు. ఊఁ ఇప్పుడే పడేయ్?'

'ఇస్తానన్నానా...'

'ఇదేటి మళ్ళీ ఆ మాటే అంతాది! నీకు దేవుడు బుద్ధివ్వనేదటమ్మా! నువ్వొట్టి బుర్రా బుద్ధీలేని మొండిదానివినాగున్నావు. రేపు డిశ్చార్జి చేస్తారు గందా, నానెలిపోయేకా యెప్పుడిస్తావమ్మా? ఏటామాట?,

'రేపిస్తా...'

'రేపా? నువ్వు సచ్చినప్పుడిస్తావు. ఏటమ్మా నీ వోలకం! సూడండమ్మల్లారా? మొగుడూ మొద్దూలేని వోల్లందరూ పిల్లల్ని కని పారేడం - మా కివ్వవల్సింది కూడా ఎగ్గొట్టడం - నువు రెండిస్తావో,

మూడిస్తావో యిప్పుడే పడేయ్. నాకు రిమ్మెత్తుకొస్తే మడిసినికాను, మరే టనుకున్నావో...'

మూడో నెంబరు పీసం చలించకుండా అటువేపు తిరిగిపోయి కొడు కుని దగ్గిరగా తీసుకొని ముద్దాడింది.

'ఇలాంటి దిక్కుమాల్న సిగ్గు మాల్నోళ్ళొస్తె మేం రెండు సేతులా తినాలి. రేపిస్తాడట-దాని బుగ్గి...'

ముత్యాలమ్మ యింకా చాలా చెడ్డ తిట్లు తిట్టింది మూడో నెంబర్ని. వార్డులో పేషెంట్లందరూ విని బిక్కచచ్చిపోయేరు.

రాత్రి పన్నెండు గంటలకి ఆపరేషను ముగించి పెద్దమ్మగారు వెళ్ళి పోయేరు. పిల్లమ్మ డాక్టర్లు హాయిగా నిద్రపోయేరు. పురుళ్ళ వార్డులో పెద్ద దీపాలారిపోయేయి. ఫాన్లు జోరుగాతిరుగుతున్నాయి. ముత్యాలమ్మ మూడో నెంబర్ని తన సవితుల జాబితాలో కలిపి, వరండాకొసని మేను వాల్చింది.

ఆకాశం మీద వెండి తెలుపులారుతున్నాయి. కాకులతోబాటు యెక్కడో వోకోయిల కూడా అరుస్తూంది. పేషెంట్లకి కాఫీ టిఫిన్లు తెచ్చే వాళ్ళొక్కక్కరే వస్తున్నారు.

మూడోనెంబరు బెడ్డుమీద పేషెంటు లేదు. బాత్‌రూం కెళ్ళిందను కున్నారు. ఆరైంది. ఏడు, ఏడున్నర. మూడోనెంబరు ఫికర్లేదు. గేటు తీయించుకెళ్ళిందో, గోడగెంతి వుడాయించిందో బ్రహ్మరుద్రుడికి తెలీదు. ఐదురోజుల పిల్లవాడు మాత్రం నిశ్చింతగా పడుకున్నాడు.

నలుగురూ నాలుగనుకున్నారు. జరగవలసిన తంతు జరిగింది.

ముత్యాలమ్మ భాగ్యంస్టాఫ్ నడిగి మడత తువ్వాలు తీసుకుంది. ఆ తువ్వాల్లో పిల్లడ్ని జాగ్రత్తగా పెట్టి గేటులోంచి అతి నిమ్మళంగా బైటకి నడిచి రిక్షా పిలిచింది.

ముత్యాలమ్మ పిల్లల్ని అమ్మదు. కన్న బిడ్డల్లా సాకుతుంది. వామనరావుని రెండు రూపాయలడిగి సినిమాకు పంపిన ఇద్దరూ ముత్యా లమ్మకి పుట్టినవాళ్ళుకారు. ఇలాంటి వాళ్ళే. ముత్యాలమ్మకి పిల్లలు పుట్ట లేదు. అసలు పుట్టరు.

★